నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పీర్జాదిగూడ, డిసెంబర్ 26: పీర్జాదిగూడ నగరపాలక సంస్థ పరిధి పీఎన్‌టీ కాలనీ 11కేవీ విద్యుత్ ఫీడర్ పరిధిలో శుక్రవారం మధ్యాహ్నం 12 నుంచి 12:30 గంటల వరకు పీ అండ్ టీ కాలనీ, వెస్ట్ కమలానగర్, విశ్వంవిహార్ కాలనీ, సుమారెసిడెన్సీ, గురు ఎన్‌క్లేవ్, భగతసింగ్‌నగర్, అయోధ్య కాలనీ, సాయినగర్ ఈస్ట్, బాపూజీ నగర్, అరుణోదయ కాలనీల్లో విద్యుత్ సరఫరా ఉండదని మేడిపల్లి విద్యుత్ ఏఈ ప్రదీప్ కుమార్ తెలిపారు.

కీసర: రాంపల్లిదాయర సబ్‌స్టేషన్ వన్నిగూడ 11కేవీ విద్యుత్ ఫీడర్ పరిధిలో శుక్రవారం ఉదయం 11నుంచి సాయంత్రం 4గంటల వరకు అగ్రికల్చర్ ఏరియాల్లో బర్సీగూడ, వన్నీగూడ, తిరుమల ఇంజినీరింగ్ కళాశాల, బర్సిగూడ అగ్రికల్చర్, వన్నీగూడ అగ్రికల్చర్, వివేకానంద కాలేజీ, భోగారం అగ్రికల్చర్ ఏరియాల్లో విద్యుత్ కోత ఉంటుందని ఏఈ మురళీకృష్ణ తెలిపారు.

ఘట్‌కేసర్: పోచారం మున్సిపాలిటీ నారపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని ఉదయం 10:30 నుంచి 11 గంటల వరకు అన్నోజిగూడ,లక్ష్మీనర్సింహ కాలనీ,ఎల్ఐజీ కాలనీ,జైపూర్, సత్యనారాయణ,సాయినగర్, ఇందిరానగర్‌లో, ఉదయం 11 నుంచి 11:30 వరకు ఆర్‌జీకే కాలనీ,ఆర్ఎన్ఆర్ హైట్స్,సాయినగర్ కాలనీ,సూర్యనగర్,11:30 నుంచి మధ్యాహ్నం 12 గంటలవరకు పోచారం,డాక్టర్స్ కాలనీ,విసయసాయి కాలనీ, 12:30 నుంచి 2గంటల వరకు అన్నానగర్,డాక్టర్స్ కాలనీ, జోడిమెట్ల ఎక్స్‌రోడ్స్,అరుంధతీ కాలనీ,కాకతీయ నగర్,వైష్ణవి కాలనీ,చౌదరిగూడ,సప్తగిరి కాలనీ,రేవతీరైస్‌మిల్ ప్రాంతం,నారపల్లి,వీకర్‌సెక్షన్ కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ ప్రదీప్‌కుమార్ తెలిపారు.

కార్యవర్గం ఎన్నిక

కాప్రా, డిసెంబర్ 26: మీర్‌పేట్ హెచ్‌బీకాలనీ డివిజన్ హెచ్‌బీకాలనీ ఫస్ట్‌ఫేజ్ ఆనంద్‌నగర్ వెల్ఫేర్‌అసోసియేషన్‌కు నూతన కార్యవర్గాన్ని కాలనీవాసులు ప్రజాస్వామ్యపద్ధతిలో ఓటింగ్ విధానం ద్వారా ఎన్నుకున్నారు. ఆనంద్‌నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన అధ్యక్షులుగా ఏ.శివరామప్రసాద్, ఉపాధ్యక్షులుగా మామిడాలకృష్ణ హరి, కైలాస శర్మ, ప్రధాన కార్యదర్శిగా బి.గోవిందరెడ్డి, సంయుక్త కార్యదర్శులుగా వి.వెంకటరెడ్డి, బి.సూర్యప్రకాష్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎస్.దేవేందర్‌కుమార్, కాళిదాస్, కోశాధికారిగా ఎన్.ఎన్.చారి, కల్చరల్ సెక్రెటరీగా యాదిరెడ్డి, ఎంవీ కృష్ణారావు, పలువురు సభ్యులు కార్యవర్గసభ్యులుగా ఎన్నికయ్యారు.

రాష్ట్రంలో అక్రమపాలన నడుస్తున్నది

కాపా, డిసెంబర్ 26: ఆరు గ్యారంటీల అమలును పక్కన పెట్టి అక్రమ అరెస్టులకు కాంగ్రెస్ ప్రభుత్వం తెరలేపిందని కాప్రాసర్కిల్ బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, ఏఎస్‌రావునగర్ డివిజన్ బీఆర్ఎస్ మాజీ అధ్యక్షులు కాసం మహిపాల్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే ఎస్‌సీ, ఎస్‌టీ కమిషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్‌ను అక్రమంగా అరెస్టు చేశారని మహిపాల్‌రెడ్డి ఆరోపించారు. రాష్ట్రంలో జరిగే అక్రమాలపై ఎక్కడ ప్రభుత్వాన్ని నిలదీసినా బీఆర్ఎస్ నాయకులను అరెస్టు చేస్తున్నారని ఆయన అసహనం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నాయకుల అరెస్టును మహిపాల్‌రెడ్డి తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ పార్టీ ఏడాది పాలనపై, ప్రభుత్వంపై ప్రజలలో తీవ్ర వ్యతిరేకత మొదలైందని అన్నారు. ఇలాగే ఖూనీ పాలన నడిస్తే రాబోయే రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు తగిన బుద్ధి చెబుతారని మహిపాల్‌రెడ్డి హెచ్చరించారు.

రేపు వాహనాల వేలం

మల్కాజిగిరి, డిసెంబర్ 26: ఎక్సైజ్ కేసులో పట్టుబడిన ఏడు వాహనాలను 28న ఉదయం 11గంటలకు వేలం వేస్తున్నట్లు మల్కాజిగిరి ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. మల్కాజిగిరిలోని ఆనంద్‌బాగ్ శివపురి కాలనీలోని ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ అవరణంలో 5 ద్విచక్రవాహనాలు, వ్యాగనార్ కారు, ఆటో వేలం వేస్తున్నట్లు తెలిపారు. వేలం పాటలో పాల్గొనేవారు రూ.2వేల డిపాజిట్‌తో పాటు ఏదైన గుర్తింపు కార్డు తీసుకుని రావాలని తెలిపారు. వివరాలకు ఫోన్ నంబర్ 8712658737, 9533551949లో సంప్రదించాలని కోరారు.

వ్యక్తి అదృశ్యం

శైలేందర్ (ఫైల్)

నేరేడ్‌మెట్, డిసెంబర్ 26: వ్యక్తి అదృశ్యమైన ఘటన నేరేడ్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. నేరేడ్‌మెట్ ఎస్సై చంద్రశేఖర్ కథనం ప్రకారం.. వినాయకనగర్‌లో నివాసం ఉంటున్న శైలేందర్ (46) ఇతనికి మాటలు రావు, చెవులు వినపడవు మరియు కుడికాలు లేదు. ఈనెల 22ఉదయం గంటల సమయంలో టిఫిన్ చేసి వస్తాను అని చెప్పి ఇంటినుంచి బయటికి వెళ్లాడు. తిరిగి ఈరోజు వరకు శైలేందర్ ఇంటికి చేరుకోలేదు. ఆయన కోసం వెతికినా ఆచూకీ లభించలేదు. గురువారం కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారిస్తామని తెలిపారు.

అయ్యప్ప స్వామి ఆలయంలో మండల పూజలు

మేడ్చల్, డిసెంబరు 26:మేడ్చల్ అయ్యప్ప స్వామి ఆలయం తెరిచి మండల రోజు(41)లు పూర్తయిన సందర్భంగా ఆలయ నిర్మాణకర్త నందారెడ్డి గురుస్వామి ఆధ్వర్యంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణపతి హోం, అభిషేకాలు నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో భాగంగా అన్నదానం చేశారు. సాయంత్రం అయ్యప్పను మేడ్చల్ పట్టణ ప్రధాన వీధుల్లో ఊరేగించి, పడి పూజ నిర్వహించారు. కార్యక్రమంలో కృష్ణమూర్తి పంతులు గురుస్వామి, రాజేశ్వర్ గురుస్వామి, స్వామి గురుస్వామి, అనిల్ గురుస్వామిలతో పాటు పెద్ద ఎత్తున అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.

పూజలో పాల్గొన్న కార్పొరేటర్ గీతా

రామంతాపూర్: చిలుకానగర్‌లో చిలకేశ్వఆంజనేయస్వామి ఆలయంలో గురువారం అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అయ్యప్ప మండల పూజలో స్థానిక కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొండల్‌రెడ్డి,జగన్, శ్యామ్, శంకర్,స్థానికులు పాల్గొన్నారు.

చిలుకానగర్‌లో అయ్యప్ప మండల పూజలో పాల్గొన్న కార్పొరేటర్ గీతాప్రవీణ ముదిరాజ్ తదితరులు


గోపాల్‌నగర్‌లో ఏకలవ్య సొసైటీ భవన నిర్మాణం కోసం భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

బస్తీల్లో కమ్యూనిటీ హాళ్లను నిర్మిస్తాం: ఎమ్మెల్యే

మల్కాజిగిరి, డిసెంబర్ 26: బస్తీల్లో కమ్యూనిటీ హాళ్లను నిర్మిస్తామని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. గురువారం మచ్చ బొల్లారం డివిజన్ గోపాల్‌నగర్‌లో ఏకలవ్య సొసైటీ భవన నిర్మాణం కోసం ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి మాట్లాడుతూ నియోజకవర్గంలోని బస్తీలు, కాలనీల్లో కమ్యూనిటీ హాళ్లను నిర్మిస్తామన్నారు. ఇప్పటికే పూర్తికాని కమ్యూనిటీ హాళ్ల నిర్మాణపనులు చేపడతామని అన్నారు.

సొసైటీలు సొంత నిధులతో భవనాలను నిర్మించడం హర్షణీయమని అన్నారు.

ఉప్పల్‌లో ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక డ్రైవ్

ఉప్పల్‌లో ట్రాఫిక్ పై ప్రత్యే డ్రైవ్ నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

రామంతాపూర్, డిసెంబర్ 26 : రాచకొండ పోలీస్ కమిషరేట్ పరిధిలో ట్రాఫిక్ పోలీసులు గురువారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు.ఇన్‌స్పెక్టర్లు మల్లేశ్,బాబ్యానాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన డ్రైవ్ లో సైలెన్సర్లతో భారీ ఎత్తున శబ్ద కాలుష్యానికి గురి కావడమే కాకుండా వాహన దారులకు తీవ్ర అసౌకర్యం కలుగుతుందన్నారు. ఈ సందర్భంగా బైకర్లపై చర్యలు తీసుకున్నారు.అలాంటి ద్విచక్ర వాహనాలను గుర్తించి సైలెన్సర్లను తొలగించారు. అంతే కాకుండా వెయ్యిరూపాయల జరిమానా విధించారు.కొత్త సైలెన్సర్లను అమర్చారు. నిబంధనలు ఉల్లంఘిస్తే రెండోసారి పట్టు బడితే చార్జిషీట్ దాఖలు చేసి కోర్టులో ప్రవేశ పెడుతామన్నారు.చట్టపరమైన చర్యలుంటాయన్నారు.నూతన సంవత్సర వేడుకలలో ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు.ఈకార్యక్రమంలో ఎస్ఐలు రమేశ్, నరేశ్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాణస్వీకారాన్ని అడ్డుకున్న మరో వర్గం

అధ్యక్షుడిగా కార్యాలయం బయట ప్రమాణ స్వీకారం చేస్తున్న హరిప్రసాద్‌రావు.

ఘట్‌కేసర్,డిసెంబర్26: పోచారం మున్సిపాలిటీ సంస్కృతి టౌన్‌షిప్ అసోసియేషన్ నూతన పాలక వర్గం ప్రమాణ స్వీకారం మరో వర్గం అడ్డుకున్నది. ఈనెల 22న అసోసియేషన్‌కు ఎన్నికలు జరిగాయి.అదే రోజు రాత్రి ఫలితాలను ముగ్గురు సభ్యులతో కూడిన ఎన్నికల ప్రతినిధులు ప్రకటించారు.అయితే ఒక్క ఓటు తేడాతో అధ్యక్షుడిగా గెలుపొందిన బి.హరిప్రసాద్‌రావు,అనతి ప్యానెల్‌లో గెలుపొందిన ముగ్గురి సభ్యులతో గురువారం ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. మరోప్యానెల్ అధ్యక్షుడు భరత్‌కుమార్ ఒక్క ఓటు తేడాతో ఓడిపోగా, మరో తొమ్మిది మంది సభ్యులు గెలుపొందారు. ఫలితాల వెల్లడిలో తమకు అనుమానాలు ఉన్నాయని, ప్రమాణ స్వీకారం చేయొవద్దని అసోసియేషన్ కార్యాలయం వద్ద భరత్ కుమార్ ప్యానెల్ సభ్యులు,మద్దతుదారులు బైఠాయించారు.ఈ పరిస్థితిని గమనించిన అధ్యక్షుడు హరిప్రసాద్‌రావు పోచారం పోలీసులకు సమాచారం అందించి కార్యాలయం బటయ ప్రమాణ స్వీకారం చేశారు. ప్రమాణ స్వీకారం చేస్తుండగా కావాలని అడ్డుకున్నారని హరిప్రసాద్‌రావు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

గణేశ్‌నగర్ సమస్యలు పరిష్కరించాలి

పోచారం మున్సిపాలిటీ 15వార్డులోని గణేశ్ నగర్ రోడ్డు నంబర్2లో రోడ్డుపై పారుతున్న మురుగునీరు.

ఘట్‌కేసర్,డిసెంబర్26: పోచారం మున్సిపాలిటీ 15వ వార్డులోని గణేశ్‌నగర్ సమస్యలను అధికారులు పరిష్కరించాలంటూ కాలనీ వాసులు నర్సింహయాదవ్,లక్ష్మణ్, నాయకులు కోరారు. పలుమార్లు మున్సిపాలిటీ కార్యాలయంలో వినతి పత్రాలు అందజేసినా సమస్య పరిష్కరిష్కారం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గణేష్ నగర్ రోడ్డు నం2లో డ్రైనేజీనీరు రోడ్డుపై పారు తూ వచ్చి పోయే ప్రజలకు ఇబ్బంది కరంగా మారిందని అన్నారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఇండ్లలోని ప్రజలు దుర్వాసన,దోమలతో సమస్యలు ఎదుర్కొంటున్నారని వివరించారు. ప్రజా ప్రతినిధులకు పలుమార్లు తెలియజేసినా పట్టించుకోవడం లేదని వాపోయారు. ఇప్పటికైనా మున్సిపాలిటీ అధికారులు గణేష్ నగ ర్ రోడ్డు నం2 సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

ఘనంగా సీపీఐ శతాబ్ధి ఉత్సవాలు

బోడుప్పల్ ఇందిరానగర్‌లో జరిగిన సీపీఐ శతాబ్ధి ఉత్సవాల్లో పాల్గొన్న కామ్రేడ్స్

శామీర్‌పేటలో

బోడుప్పల్, డిసెంబర్26: బోడుప్పల్ నగరపాలక సంస్థ ఇందిరానగర్ కాలనీ ప్రధాన కూడలిలో సీపీఐ శతాబ్ధి ఉత్సవాలు గురువారం ఘనంగా జరిగాయి. సీపీఐ మండల కార్యదర్శి రచ్చ కిషన్ అధ్యర్యంలో జరిగిన ఈ ఉత్సవాలకు పార్టీ సీనియర్ నాయకులు దండు రమేశ్, రచ్చ వాసుదేవ్ ముఖ్య అతిథులుగా హాజరై జండాను ఆవిష్కరించారు.ఈ సంధర్భంగా రచ్చ కిషన్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న కార్మిక, కర్షక వ్యతిరేక చర్యలను తీవ్రంగా ఖండించారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యురాలు లక్ష్మి, ప్రమీల, బాపురాజు, మాధవి, జ్యోతి, మహాలక్ష్మి, అన్వర్, నాగరాజు, కనకయ్య, మథర్, ఇస్తారి, సోమరాజు, అండాళు, మణెమ్మ, లక్ష్మి, సత్తమ్మ, భీమరాజు, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

శామీర్‌పేట: సీపీఐ పార్టీ శతజయంతి ఉత్సవాల్లో భాగంగా శామీర్‌పేటలో సీపీఐ జిల్లా కార్యదర్శి డీజీ.సాయిలుగౌడ్ ఆధ్వర్యంలో సీపీఐ జెండాను గురువారం మండల కార్యదర్శి డీజీ నరేందర్‌ప్రసాద్, రామరం మల్లయ్య, నాగరాణి, నవీన ఆవిష్కరించారు.

నూతన క్యాలెండర్ ఆవిష్కరణ

కీసర: కీసరగుట్ట ఆలయ ప్రాంగణమందిరంలో గురువారం 2025 సంవత్సరానికి సంబంధించి నూతన క్యాలెండర్‌ను పీఆర్‌టీయూఎస్ రాష్ట్ర అధ్యక్షులు పింగళి శ్రీపాల్‌రెడ్డి ఆవిష్కరించారు.

శ్రీ హంపీ విరూపాక్ష విద్యారణ్య పీఠం పరిధిలోకి

శ్రీమాతా నిమిషాంబికా దేవి ఆలయం

బోడుప్పల్, డిసెంబర్26: బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని శ్రీమాతా నిమిషాంబికాదేవి ఆలయం శ్రీహంపీ విరూపాశ్రీ విద్యారణ్య పీఠం ఆధీనంలోకి చేరింది. ఇకపై హంపీ పీఠం ఆధ్వర్యంలో అమ్మవారికి నిర్వహించే అన్నిరకాల పూజా క్రతువులు కొనసాగనున్నాయి. శ్రీహంపీ విరూపాశ్రీ విద్యారణ్య మహాప్రస్థానం కింద భక్తులకు వివిధ రకాల సేవలు అందుబాటులోకి రానున్నాయి. ప్రతిరోజూ ఉదయం 6నుంచి మధ్యాహ్నం 12:30 వరకు సాయంత్రం 5:30 నుంచి రాత్రి 8:30గంటలవరకు ఆలయం తెరిచిఉంటుందని ఆలయ కార్యనిర్వాహకులు శ్రీనివాస్‌రావు వెల్లడించారు.జనవరి1న గత సంవత్సరం అమ్మవారికి సమర్పించిన చీరలను ఆలయ ప్రాగణంలో వేలం నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ కామరౌత్ వినోద్‌కుమార్ తెలిపారు.

శ్రీవారికి చందనంతో ప్రత్యేక అలంకరణ

నేరేడ్‌మెట్,డిసెంబర్ 26: ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా గురువారం ఆనంద్‌బాగ్ చౌరస్తాలోని శ్రీ లక్ష్మీవేంకటేశ్వరస్వామిని ఏకాదశిని పురస్కరించుకొని ప్రత్యేక చందన అలంకరణ చేసినట్లు ఆలయ ప్రధాన అర్చకులు ముడుంబై వెంకట రమణా చార్యులు, అర్చకులు తులసి వెంకట రమణాచార్యులు తెలిపారు. నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాలనుంచి భక్తులు తరలివచ్చి శ్రీవారినిదర్శించుకున్నట్లు తెలిపారు. స్వామి వారిని దర్శించుకున్న భక్తులకు స్వామివారి తీర్థప్రసాదాలు అందించినట్లు ఆలయ కార్యనిర్వాహధికారి ఏ.రవీంద్రరెడ్డి , క్లర్క్ సుధాకర్ సంద్ర తెలిపారు.

అకాడమిక్ హైట్స్ స్కూలో స్పోర్ట్స్ డే

రామంతాపూర్,డిసెంబర్ 26: హబ్సిగూడ అకాడమిక్ హైట్స్ స్కూలోగురువారం స్పోర్ట్స్ డే నిర్వహించారు.వివిధ క్రీడాపోటీల్లో విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చారు.ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు 100 మీటర్ల పరుగు పందెం నిర్వహించారు.ప్రథమ,ద్వితీయ తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు పాఠశాల డైరెక్టర్ శివకుమార్ కరస్పాండెంట్ కల్పనా, ప్రధానోపాధ్యాయులు నిషాత్ అంజుమ్ మెడల్స్ ప్రదానం చేశారు. విద్యార్థులకు శారీరక మానసిక ధృడత్వం పెరిగేలా క్రీడలు ఎంతో ఉపయోగ పడుతాయన్నారు.ఈకార్యక్రమంలో విద్యార్థుల తల్లి తండ్రులు పాల్గొన్నారు.

క్రీడల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు కప్ అందజేస్తున్న పాఠశాల ప్రతినిధులు.

పోలీసుల తీరుపై ఏసీపీకి ఫిర్యాదు

మేడ్చల్ ఏసీపీకి ఫిర్యాదు చేస్తున్న అయ్యప్ప స్వాములు.

మేడ్చల్, డిసెంబర్ 26 : అయ్యప్ప మహాపడి పూజలో మేడ్చల్ పోలీసులు, ఎస్ఐ అశోక్‌కుమార్ వ్యవహార శైలి అయ్యప్ప స్వాములపై కేసు నమోదు చేస్తూ హిందువుల మనోభావాలు దెబ్బ తీసే విధంగా ఉన్నాయని విశ్వహిందు పరిషత్ నేతలు, అయ్యప్పమాలాధారణ స్వాములు అన్నారు. అయ్యప్ప మహాపడి పూజలో మేడ్చల్ పోలీసులతీరును నిరసిస్తూ గురువారం అయ్యప్ప స్వాములు మేడ్చల్ ఏసీపీకి ఫిర్యాదు చేశారు. ఎస్ఐ అశోక్‌కుమార్ చర్యలతో హిందువుల మనోభావాలను దెబ్బతీయడంతో పాటు అయ్యప్ప స్వాములపై దురుసుగా మాట్లాడుతూ దాడి చేసే ప్రయత్నం చేశాడన్నారు. ఇదేంటని ప్రశ్నిస్తే అయ్యప్పస్వాములపై అక్రమ కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ విషయమై పోలీసులపై చర్యలు తీసుకుని హిందువుల మనోభావాలను కాపాడాలని తూంకుంట వాసి అయ్యప్పమాలాధారణ స్వామి నూనెముంతల రవీందర్‌గౌడ్ ఫిర్యాదులో పేర్కొన్నారు.

అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు ప్రారంభం


పనులను ప్రారంభిస్తున్న చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి

మేడ్చల్ కలెక్టరేట్, డిసెంబరు 26: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని శ్రీరామ్‌నగర్ కాలనీలోరూ.4.80 లక్షలతో చేపట్టిన భూగర్భ నీటి పారుదల వ్యవస్థ నిర్మాణ పనులకు మున్సిపాలిటీ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి గురువారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ శ్రీనివాస్ గౌడ్, నాయకులు మెరుగు శ్రీనివాస్ రెడ్డి, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ట్యాంకు నిర్మాణ పనుల పరిశీలన

పనులను పరిశీలిస్తున్న కౌన్సిలర్ మణికంఠా గౌడ్

మేడ్చల్, డిసెంబరు 26 : మేడ్చల్ మున్సిపాలిటీ 6వ వార్డు పరిధిలోని పెద్ద చెరువు మత్తడి వద్ద రూ.2 లక్షలతో చేపడుతున్న ట్యాంక్ నిర్మాణంతో పాటు గదుల నిర్మాణ పనులను వార్డు కౌన్సిలర్ రామన్నగారి మణికంఠాగౌడ్ గురువారం పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెద్ద చెరువు మత్తడి వద్ద ప్రజల సౌకర్యార్థం నీటి ట్యాంకుతో పాటు రెండు గదులను నిర్మిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సత్యనారాయణ, శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును తన కార్యాలయంలో కలిసి సమస్యలు తెలుపుతున్న స్థానికులు

దుండిగల్ : ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్సీ, మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు శంభీపూర్ రాజు అన్నారు. గురువారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని పలువురు ప్రజా ప్రతినిధులు, ప్రజలు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు శంభీపూర్‌లోని ఎమ్మెల్సీ కార్యాలయంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. తమ కాలనీలు, బస్తీల్లో నెలకొన్న సమస్యలను తెలియజేసి పరిష్కరించడంతో పాటు మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. ఎమ్మెల్సీ సానుకూలంగా స్పందిస్తూ సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటానని, ప్రజా అవసరాలకు అనుగుణం గా మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం పలువురు తాము నిర్వహిస్తున్న వివిధ కార్యక్రమాలకు రావాలని ఆహ్వాన పత్రికలు అందజేశారు.

శిబిరంలో రక్తదానం చేస్తున్న యువకులు

యువత రక్తదానానికి ముందుకురావాలి

మన్సూరాబాద్, డిసెంబర్ 26: రక్తదానం చేయడం వల్ల ఎలాంటి ఆరోగ్య సమస్యలు తలెత్తవని రాష్ట్ర దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య తెలిపారు. మన్సూరాబాద్ డివిజన్ పరిధి సుష్మ చౌరస్తా సమీపంలోని ప్రసిద్ధ మల్టీ స్పెషాలిటీ దవాఖానలో గురువారం నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రసిద్ధ హాస్పిటల్ ఎండీ జాకూరి చైతన్యరాజు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న యజ్ఞ మహోత్సవాలు

మన్సూరాబాద్, డిసెంబర్ 26: నాగోల్ డివిజన్ జనప్రియ ఎన్‌క్లేవ్ పార్కులో వైదిక విజ్ఞాన ట్రస్ట్ ఆధ్వర్యంలో రుగ్వేద, యజుర్వేద, సామవేద హవన సహిత గజేంద్రమోక్ష ప్రవచన పాంచాహ్నిక జ్ఞాన యజ్ఞ మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. మూడో రోజు ఏకాదశి స్వాతి నక్షత్రమును పురస్కరించుకుని గురువారం శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారికి విశేష కలశాభిషేకం చేశారు. వేద పండితులు పూజలు చేశారు.భక్తులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. వైదిక విజ్ఞాన ట్రస్ట్ వ్యవస్థాపకుడు వాడ్రేవు శ్రీనివాస్ రావు, ధర్మరక్ష సంస్థ వ్యవస్థాపకులు చిట్టి హనుమత్‌శాస్త్రి పర్యవేక్షణలో జరుగుతున్న ఈ యజ్ఞ మహోత్సవాల్లో భద్రాచల ఆలయ ఆస్థాన వేద పండితులు, ఉభయ వేదాంత విద్వాన్ గుదిమెళ్ల మురళీకృష్ణమాచార్యులు ప్రవచన కార్యక్రమం నిర్వహించారు.

శ్రీలక్ష్మీనరసింహస్వామి వారికి విశేష కలశాభిషేకం నిర్వహిస్తున్న వేద పండితులు

బంగారు గొలుసు చోరీ

మియాపూర్ ,డిసెంబర్ 26 : ఓ మహిళ మెడలో నుంచి నాలుగు తులాల బంగారు గొలుసు దొంగిలించిన ఘటన కేపీహెచ్‌బీ పీఎస్ పరిధిలో చోటు చేసుకున్నది. కేపీహెచ్‌బీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కేపీహెచ్‌బీ కాలనీ పరిధిలోని రోడ్ నం. 29 సాయి తేజ టవర్స్‌లో నివసించే మేక మణి పండ్లు కొని ఇంటికి వెళ్తున్నక్రమంలో గుర్తు తెలియని వ్యక్తులు బైక్‌పై వచ్చి మెడలో నుంచి నాలుగు తులాల బంగారు గొలుసును చోరీ చేశాడు. బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కేపీహెచ్‌బీ సీఐ వెంకటేశ్వర్‌రావు గురువారం తెలిపారు.

- కేపీహెచ్‌బీ ఠాణా పరిధిలోని శ్రీనివాసనగర్‌లో బీఎంఆర్ హైట్స్‌లో పేకాట ఆడుతున్న వారిపై పోలీసులు దాడి చేసి ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.42,420 నగదుతో పాటు ఏడు చరవాణిలు, 9 సెట్ల కార్డులను స్వాధీనం చేసుకున్నారు.

జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు

గురుకుల విద్యార్థినుల ఎంపిక

ఘట్‌కేసర్ రూరల్, డిసెంబర్ 26: ఘట్‌కేసర్ మున్సిపాలిటీ అంకుషాపూర్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాల(మహేంద్రహిల్స్)కు చెందిన విద్యార్థులు జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ స్నేహలత తెలిపారు. ఈనెల 23 నుంచి తమిళనాడులోని దిండిగల జిల్లా కేంద్రం జేటీఎస్ ఆర్ట్స్ కళాశాలలో నిర్వహిస్తున్న 46వ జాతీయ స్థాయి బాలికల హ్యాండ్‌బాల్ ఛాంపియన్‌షిప్-2024 జరిగింది. గురుకుల కళాశాలకు చెందిన కే.అనూష, బి. కల్పనలు అత్యుత్తమ ప్రతిభ కనపరిచి జాతీయ స్థాయికి ఎంపికైనట్లు చెప్పారు. అనూష, కల్పనలతో పాటు కోచ్ పద్మిని గుప్తాను ప్రిన్సిపాల్ అభినందించారు.

జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థినులు